సేవాలాల్ బోధనలు సమాజానికి మార్గదర్శకం

మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, ఫిబ్రవరి 14 : బంజారా గిరిజన సమాజానికి ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని బీఆర్ఎస్ నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆ మహనీయుడి జయంతి సందర్భంగా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సేవాలాల్ మహారాజ్ సమాజ సేవకు, సామాజిక సమానత్వానికి చేసిన కృషి ప్రతిఒక్కరికీ మార్గదర్శకమని కొనియాడారు. బంజారా తెగల అభివృద్ధి, హక్కుల పరిరక్షణ కోసం ఆయన పాటుపడ్డారని పేర్కొన్నారు. బంజారా సమాజం ఐక్యంగా ఉంటూ, విద్యా, ఉపాధిరంగాల్లో మరింత పురోగమించాలని ఆకాంక్షించారు. సేవాలాల్ మహారాజ్ తన జీవితాన్ని తండాల్లోని మూఢనమ్మకాలను, సామాజిక అన్యాయాలను ఎదిరించి, నిరక్షరాస్యతను తగ్గించేందుకు, ఆర్థిక అసమానతలను తగ్గించేందుకు ఉద్యమంలా కృషిచేశారు. సేవే తన లక్ష్యంగా, సత్యం, సమానత్వం తన ఆయుధాలుగా నమ్మి, కేవలం మాటల్లో కాకుండా ప్రతి కార్యాన్ని ఆచరణలో పెట్టి, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు సంత్ సేవాలాల్ అని వెల్లడించారు.

మిర్చి రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

మార్కెట్ కమిటీ, అధికారుల సమావేశంలో ఆర్జేడీ శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ శ్రీనివాస్

రఘునాథపాలెం, ఫిబ్రవరి 14 : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు మిర్చి పంటను తీసుకొచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఉప్పల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చాంబర్‌లో మార్కెట్ అధికారులు, కమీషన్ వ్యాపారులు, ఆటో ట్రాలీ, దడవాయి సంఘాల నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్‌కు వచ్చే మిర్చి పంట విక్రయాలు పూర్తయిన వెంటనే తోలకాలు సైతం అదేరోజు జరగాలని, మరుసటి రోజు మిర్చి పంటను తీసుకొచ్చే రైతులకు మార్కెట్ యార్డును అందుబాటులో ఉంచాలన్నారు. మిర్చి పంట తోలకాల విషయంలో ట్రాలీలు, దడవాయిలకు మధ్య ఉత్పన్నమయ్యే సమస్యను సమావేశంలో భాగంగా ఆర్జేడీ లేవనెత్తారు. ఇది పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, అధికారులతో కలిసి మార్కెట్ యార్డులో పర్యటించి ధరలను తెలుసుకున్నారు. రైతులు తమ మిర్చి బస్తాలను కోల్డ్‌స్టోరేజీలో నిల్వ ఉంచి పంట విలువలో రూ.2 లక్షల వరకు రుణం పొందవచ్చునని సూచించారు. తీసుకున్న రుణంపై 180రోజుల వరకు ఎలాంటి వడ్డీ ఉండదన్నారు.

ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో అరుదైన ఆపరేషన్

మహిళ కడుపులోని 5కిలోల కణితి తొలగింపు

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 14 : ఖమ్మం జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో వైద్యులు అరుదైన ఆపరేషన్ చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఓ మహిళ కడుపులో నుంచి 5కిలోల కణితి తొలగించారు. పెద్దాసుపత్రి చరిత్రలో ఈ తరహా ఆపరేషన్ ఇదే మొదటిసారి. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణానికి చెందిన డీ సుశీల గత కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నది. ఆమె భర్త ముత్తయ్య సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు. రెండువారాల క్రితం కడుపు ఉబ్బరం, నొప్పి, ఆయాసంతో నగరంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రికి వచ్చింది. స్థానిక మాతా, శిశు సంక్షేమ విభాగానికి చెందిన వైద్యులు ఆమెను పరీక్షించి స్కానింగ్, రక్త, మూత్ర ఇతర అన్నిరకాల వైద్య పరీక్షలకు సిఫారస్ చేశారు. వాటి ఫలితాలు అందిన తర్వాత గురువారం మరోసారి సదరు మహిళ దవాఖానకు వచ్చింది. వెంటనే ఇన్‌పేషెంట్‌గా తీసుకున్న డాక్టర్లు సుశీల కడుపులో పెరుగుతున్న కణితిని గుర్తించారు. తక్షణమే స్పందించి శుక్రవారం సర్జరీ చేయగా, 5కిలోల బరువున్న కణితి బయటపడింది. ప్రస్తుతం బాధిత మహిళ కోలుకుంటున్నదని, మరో నాలుగైదు రోజుల్లో పూర్తి ఆరోగ్యంతో ఇంటికి పంపిస్తామన్నారు. సర్జరీ ప్రక్రియలో డాక్టర్ యామిని(హెచ్‌వోడీ ఓబీఎస్), డాక్టర్ అపర్ణ(ప్రొఫెసర్), డాక్టర్ రాధిక(అసోసియేట్ ప్రొఫెసర్), డాక్టర్ శ్రీవిద్య(అసిస్టెంట్ ప్రొఫెసర్), డాక్టర్ రిషిక(పీజీ) పాల్గొన్నారు. అత్యంత క్లిష్టమైన సర్జరీని విజవంతంగా పూర్తిచేసి మహిళ ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్ ఎంవో డాక్టర్ బీ.రాంబాబు ప్రత్యేకంగా అభినందించారు.

18న కబడ్డీ ఎంపికలు

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 14 : ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో 34వ సబ్ జూనియర్ బాలురు, బాలికల కబడ్డీ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తుంబూరు దయాకర్‌రెడ్డి, కటికల క్రిస్టఫర్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారుల వయస్సు 16 సంవత్సరాల్లోపు, బరువు 55కిలోల లోపు ఉండాలన్నారు. ఎంపికైన బాలబాలికలు ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు వికారాబాద్‌లో జరుగే 34వ తెలంగాణ రాష్ట్ర అంతర్ జిల్లాల సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో జిల్లా తరపున ఆడతారన్నారు. పూర్తి వివరాలకు 7396669337 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

★ ప్రముఖ రియల్ ఎస్టేట్స్ ఆఫీసు, ఖమ్మం నందు అనుభవం కలిగిన డ్రైవర్స్, కారు డ్రైవర్‌గా పని చేయుటకు కావలెను. సంప్రదించవలసిన నెంబర్లు : 9985953170, 9640231009
KMM

GOLD FINANCE

★మీ బంగారం మణప్పరం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916. స్పాట్ క్యాష్.
NT-337308

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

పేరు మార్పు

వెంపటి ప్రభాకర్ రావు (పాత పేరు), S/o. వెంపటి రామకోటయ్య, R/o. ఇ.నెం. 1-61, ఏదులాపురం గ్రామం, ఖమ్మం రూరల్ మం॥, ఖమ్మం జిల్లా. అను నా పేరును వెంపటి ప్రభాకర్ (కొత్త పేరు), S/o. వెంపటి రామకోటయ్య గా మార్చుకున్నాను.

పేరు మార్పు

వెంపటి సింధు (పాత పేరు), W/o. వెంపటి పవన్ కుమార్, R/o. ఇ.నెం. 11-11-179/2/202/A/1, ఉష్మశ్రీ టవర్స్, కొత్త బస్టాండ్, బైపాస్ రోడ్, ఖమ్మం అర్బన్ మం॥, ఖమ్మం జిల్లా. అను నా పేరును పసుపులేటి సింధు (కొత్త పేరు), W/o. వెంపటి పవన్ కుమార్ గా మార్చుకున్నాను.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

'రౌండ్ టేబుల్' సమావేశాన్ని జయప్రదం చేయండి

- అన్ని పార్టీల నుంచి బీసీ నాయకులు హాజరుకావాలి
- విలేకరుల సమావేశంలో గుండాల కృష్ణ, కూరాకుల

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుండాల కృష్ణ

ఖమ్మం, ఫిబ్రవరి 14: కులగణనలో బీసీలను తక్కువ సంఖ్యలో చూపి రిజర్వేషన్లపై మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు, బీసీలకు అండగా ఉంటూ పోరాడేందుకు ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చినట్లు బీఆర్ఎస్ నేతలు, మున్నూరుకాపు, యాదవ సంఘాల నాయకులు గుండాల (ఆర్‌జేసీ) కృష్ణ, కూరాకుల నాగభూషణం తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటూ హామీ ఇచ్చి.. ఆ తరువాత ద్రోహానికి పాల్పడుతున్న కాంగ్రెస్‌ను నిలదీసేందుకు ఆమె రంగంలోకి దిగినట్లు చెప్పారు. ఈ మేరకు బీసీలను జాగృతం చేసేందుకు ఖమ్మంలోని సప్తపది పంక్షన్ హాల్లో శనివారం బీసీ సంఘాల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి వివిధ పార్టీలకు చెందిన బీసీ నేతలు, బీసీ సంఘాల నాయకులు హాజరై ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆర్ జేసీ కృష్ణ, కూరాకుల నాగభూషణం మాట్లాడారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించే బీసీ నాయకుల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. కులగణనలో తప్పుడు లెక్కలు, బీసీ రిజర్వేషన్లలో జరిగిన మోసాలపై ఆమె ప్రసంగిస్తారని అన్నారు. అలాగే, శనివారం ఉదయం 10 గంటలకు జిల్లా జైలులో ఉన్న బీఆర్ఎస్ నాయకుడు లక్కినేని సురేందర్ రావును పరామర్శిస్తారని, 10:30 గంటలకు పాండురంగాపురంలో మందిరాన్ని సందర్శిస్తారని, 11 గంటలకు బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు నివాసానికి చేరుకుంటాని, 11:30 గంటలకు బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొంటారని, ఆ తరువాత సప్తపది పంక్షన్ హాల్లో జరిగే బీసీల రౌండ్ టేబుల్ సమావేంలో ప్రసంగిస్తారని వివరించారు. తెలంగాణ జాగృతి నాయకుడు పవన్ నాయక్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డీసీసీబీ, పీఏసీఎస్‌ల పదవీకాలం పొడిగింపు

రఘునాథపాలెం, ఫిబ్రవరి14 : ఖమ్మంజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పాలకవర్గం, జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాల పదవీ కాలాన్ని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా డీసీసీబీ పాలకవర్గాలు, పీఏసీఎస్ పాలకవర్గాల పదవీ కాలాన్ని మరో 6నెలలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర కో-ఆపరేటీవ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డీసీసీబీ చైర్మన్లకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పొడిగింపు ఉత్తర్వులను అందజేశారు.

18న ఖమ్మంలో మిర్చి రైతుల ధర్నా

వైరాటౌన్, ఫిబ్రవరి14: ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏన్కూరు మండలం రాయమాదారం, మర్కుకుంట, బీక్యాతండా, తిమ్మారావుపేట తదితర గ్రామాల్లో 18న ఖమ్మం వ్యవసాయ మార్కెట్ వద్ద మిర్చి రైతులు చేస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. గుండా సత్యనారాయణరెడ్డి, దొంతిబోయిన నాగేశ్వరరావు, వేల్పుల రాములు, మన్నేపల్లి పద్మా, గుండా కమలమ్మ, కొడెం బిక్షం, షేక్ జాని, కలసాని వీరయ్య, మాడపాటి రాజేశ్, కలసాని కృష్ణ పాల్గొన్నారు.

మహాశివరాత్రి జాతర పోస్టర్ ఆవిష్కరణ

వైరాటౌన్, ఫిబ్రవరి 14: వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 26 నుంచి జరిగే జాతర పోస్టర్‌ను శుక్రవారం ఖమ్మం ఆర్‌డీవో గరిడి నర్సింహారావు అధికారులతో ఆవిష్కరించారు. తొలుత అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జాతర కల్యాణ మహోత్సవం ఏర్పాట్లకు సంబంధించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

ఉద్యోగులు ఒత్తిడి లేకుండా పనిచేయాలి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కలెక్టరేట్‌లో నూతన చాంబర్లను ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, ఫిబ్రవరి 14 : సమర్థవంతంగా విధుల నిర్వహణ చేస్తూ, నిర్దిష్టమైన సేవలను ప్రజలకు సకాలంలో అందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఆరు రెవెన్యూ విభాగ పర్యవేక్షకుల కోసం ఏర్పాటు చేసిన కొత్త చాంబర్లను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టరేట్‌కు ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయని నమ్మకంతో వస్తారని, వారి పట్ల చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. నిర్దిష్టమైన సేవలను ప్రజలకు సకాలంలో అందించాలని, అధికారులు బాధ్యతాయుతంగా, జవాబుదారితనంతో పని చేయాలన్నారు. ఒక దరఖాస్తు పరిష్కారం మన చేతిలో లేనిపక్షంలో ఆ సమస్యకు ఎలా పరిష్కారం దొరుకుతుందో అవసరమైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఉద్యోగులు ఒత్తిడి లేకుండా విధులను నిర్వహించాలని, ఒత్తిడికి గురైతే పని తీరుపై ప్రభావం పడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో ఎన్.అరుణ, వివిధ సెక్షన్ల పర్యవేక్షకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు లెక్క తప్పింది..!

కాంగ్రెస్ సర్కారుకు తగిన గుణపాఠం చెబుతాం

ఆకుల గాంధీ, పారా నాగేశ్వరరావు

మాట్లాడుతున్న పారా నాగేశ్వరరావు

ఖమ్మం సిటీ/ ఖమ్మం, ఫిబ్రవరి 14 : రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ సర్కార్ నిర్వహించిన కులగణన సర్వేలో మున్నూరు కాపుల లెక్క తప్పిందని.. 22శాతం మంది ఉన్న తమను మూడున్నర శాతం తక్కువగా చూపించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, జిల్లా ఉపాధ్యక్షుడు పారా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల పైచిలుకు ఉన్న తమను సర్వేలో 14లక్షలుగా చూపించడం ఏంటని ఆగ్రహించారు. గత బీఆర్ఎస్ హయాంలో 28 లక్షలుగా ఉంటే ఇప్పుడు 13 లక్షలుగా చూపించడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం కులగణన విషయమై రీ సర్వే చేయాల్సిందేనని వారు డిమాండ్ చేశారు. జనాభా తగ్గించి చూపించడం వలన రిజర్వేషన్ ప్రాతిపదికన అందించే సంక్షేమ ఫలాలు, ఉద్యోగాలు, పార్టీల సీట్ల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు హైదరాబాద్‌లో రాజకీయాలకు అతీతంగా 10లక్షల జనాభాతో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ముందుగా ఈ నెల 17న అన్ని జిల్లాల కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పసుపులేటి దేవేందర్, ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు మేకల భిక్షయ్య, మారిశెట్టి వెంకటేశ్వరరావు, మానుకోట సత్యనారాయణ పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి:యూఎఫ్‌బీయూ

ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

రఘునాథపాలెం, ఫిబ్రవరి14: బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని ఖమ్మం జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సమాఖ్య ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. జాతీయ సంఘాల సమాఖ్య తలపెట్టిన సమ్మెకు కొనసాగింపుగా శుక్రవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బ్యాంకుల్లో అవసరమైన సిబ్బంది నియామకం చేపట్టాలని, ఐదు రోజులు మాత్రమే పని దినాలు కేటాయించాలన్నారు. బ్యాంకు సిబ్బందిపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూబీఐ ఉద్యోగులు విష్ణువర్ధన్, పవన్, దేవేందర్, లవణ్, సాయి పాల్గొన్నారు.

మామిడి, ఆయిల్‌పాం, పట్టుపురుగుల పెంపకంపై అవగాహన

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 14: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో మామిడి, ఆయిల్‌పాం, పట్టుపురుగుల పెంపకంపై శుక్రవారం జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా పట్టుపురుగుల శాఖ అధికారి ముత్యాలరావు పట్టుపురుగుల పెంపకం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ ఆయిల్‌పాం తోటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం వైరా శాస్త్రవేత్త డాక్టర్ వీ.చైతన్య మామిడిపూత- పిందె సమయంలో తీసువాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో మధిర మండల ఉద్యాన శాఖ అధికారి విష్ణు, వ్యవసాయ అధికారి శ్రీసాయి, కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కే.రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

డిజిటల్ క్రాప్ సర్వే వేగవంతం చేయాలి

సత్తుపల్లి, ఫిబ్రవరి 14: జిల్లా వ్యాప్తంగా జరిగే డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డీ.పుల్లయ్య వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని రేజర్లలో జరుగుతున్న డిజిటల్ క్రాప్ సర్వేను జిల్లా సహాయ వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 2,42,267 ఎకరాలను లక్ష్యంగా నిర్దేశించారని, దానికి గాను 99,107 ఎకరాలను ఇప్పటి వరకు సర్వే పూర్తి చేశామన్నారు. యాసంగిలో జిల్లా వ్యాప్తంగా ఆయా సహకార సంఘాల పరిధిలోని రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి వై.శ్రీనివాసరావు, ఏఈవో నరేశ్, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం

కూమంమంచి, ఫిబ్రవరి 14: ఏడీఐపీ, ఆర్‌వీవై పథకం కింద అలీం కో హైద్రాబాద్‌వారి సౌజన్యంతో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలో శుక్రవారం దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం కావాల్సిన క్యాలీపర్స్, ట్రైసైకిళ్లు, మోటర్ సైకిళ్ళు, బ్యాటరీ వాహనాల ఎంపిక కోసం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీడీ రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ దివ్యాంగుడిని ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన పథకాలతోపాటు అలీంకో ఆధ్వర్యంలో క్యాలీపర్స్‌ను అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో ఎం.కవిత ఏసీడీపీవో రత్నకుమారి, సూపర్‌వైజర్లు జీ.ఉమ, సువర్చల, రమాదేవి, పుష్పావతి, రామారావు, రాకేశ్, అంగన్‌వాడీ టీచర్లు పుష్పలత, లక్ష్మీకాంతం, పద్మ, రాజ్యం, అలీం కో సంస్థ నుంచి ప్రసన్న కుమార్, సతీశ్‌పాట్ నాయక్, రాజబాబు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 14 : విద్యార్థులు చదువుకునే సమయంలో జ్ఞాన సముపార్జన పైన దృష్టిపెట్టాలని ముఖ్యంగా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు అరికట్టడంలో సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కేవీ చంద్రశేఖరరావు అన్నారు. శుక్రవారం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యరహిత సమాజం-యువతపాత్ర అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో అడ్వకేట్ శరణ్య, డాక్టర్ శ్రీనివాస్ పరిణతి, శాస్త్రి, సునంద, వీరన్న, సర్వేశ్వర రావు, ఒంకార్, మధు పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు నివాళి

మధిర, ఫిబ్రవరి 14: మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పుల్వామా దాడిలో అమరులైన సీఆర్‌పీఎఫ్ జవాన్లకు శుక్రవారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పల్లపోతు ప్రసాదరావు, చల్లా సత్యనారాయణ, రంగిశెట్టి శ్రీనివాసరావు, లింగంపల్లి అప్పారావు, బజాజ్ సాంబిరెడ్డి, చలువాది రాజశేఖర్, ఆదూరి అబ్రహం, కంచిపోగు ఆదాం పాల్గొన్నారు.

దళిత నియోజకవర్గంలో దళితులపై అగ్రవర్ణాల దాడి బాధాకరం

ఉప ముఖ్యమంత్రి భట్టి రాజీనామా చేయాలి

బీఎస్పీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు

చింతకాని పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీఎస్పీ నాయకులు

మధిర, ఫిబ్రవరి 14 : దళిత నియోజకవర్గంలో దళితులపై అగ్రకులాల వారు దాడికి పాల్పడడం బాధాకరమని బీఎస్పీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మధిర నియోజకవర్గంలోని చింతకాని పోలీస్‌స్టేషన్ ఎదుట బీఎస్పీ నాయకులు బాధితులతో కలిసి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ నాడు రేపల్లెవాడకు చెందిన మరియమ్మను ఇదే పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి హతమార్చిన ఘటన మరిచిపోకముందే మళ్లీ ఇదే పోలీస్‌స్టేషన్‌లో దళిత యువకులపై అగ్రవర్ణ కులాలు అక్రమంగా కేసులు పెట్టడం బాధాకరమన్నారు. అక్రమ కేసులు పెడుతున్నారని, అగ్రకులాల వారు దాడులు చేస్తున్నా భట్టివిక్రమార్క పట్టించుకోవడం లేదని వాపోయారు.అగ్రకులాల వారు అక్రమ కేసు బనాయిస్తే దళిత కుటుంబానికి చెందిన వ్యక్తులను దారుణంగా ఒక సీఐ కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. కమ్మ, రెడ్డి కులాలను సపోర్టుగా ఉన్న ఉపముఖ్యమంత్రి తక్షణమే తన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధితులతోపాటు బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల నాగరాజు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయ్, చింతకాని మండల అధ్యక్షుడు ఉసేకల నవీన్, మధిర నియోజకవర్గ సీనియర్ నాయకులు రమేశ్, బంధం వంశీ, కార్తీక్ పాల్గొన్నారు.

మనోజ్‌పై దాడిచేసిన నిందితుల అరెస్టు

ఖమ్మం జిల్లా బోనకల్లు గ్రామానికి చెందిన మిలటరీ మ్యాన్ బూదాల మనోజ్‌పై దాడి చేసిన నిందితులను అరెస్టు చేసి విచారిస్తున్నట్లు వైరా ఏసీపీ రెహమాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతకాని మండలం నాగులవంచలోని పెట్రోల్‌బంక్‌లో ఇటీవల జరిగిన ఘర్షణకు సంబంధించిన కేసు విచారణలో భాగంగా ఫిబ్రవరి 11న చింతకాని పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మనోజ్‌పై గోవిందాపురం-ఎల్ గ్రామానికి చెందిన ఉమ్మినేని రమేష్, చింతకానికి చెందిన లగడపాటి సాయి స్టేషన్ ఆవరణలోనే దాడి చేశారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మనోజ్ ఫిర్యాదు మేరకు రమేష్, సాయిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. శుక్రవారం చింతకాని పోలీసులు నిందితులిద్దరిని అరెస్టు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ముక్రంజాహి మస్జీద్ నూతన కమిటీ నియామకం

మధిర, ఫిబ్రవరి 14: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ముక్రంజాహి మస్జీద్ నూతన కమిటీని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు వారి ఆదేశాల మేరకు శుక్రవారం ఏర్పాటు చేశారు. కమిటీ ప్రెసిడెంట్‌గా ఎండీ. అస్మతుల్లా, వైస్‌ప్రెసిడెంట్‌గా షేక్ జహంగీర్, జాయింట్ సెక్రటరీలుగా సయ్యద్ సాధిక్‌అలీ, ఎండీ.ఖాజా, ట్రెజరర్